క్లుప్తంగా

18 నుంచి కంటి వెలుగు షురూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో కంటి వెలుగుపై అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం, కంటి వెలుగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ఎవరూ కంటి సమస్యలతో బాధపడకూడదు అన్న ఉద్దేశంతో ఒక మంచి సంకల్పంతో ప్రారంభిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18 నుంచి ప్రారంభం కాబోతుందని అన్నారు. నియోజకవర్గంలోని కేటాయించిన ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఎవరైన కంటి సమస్యలతో బాధపడుతుంటే వారికి పరీక్షలు నిర్వహించి తగిన కళ్లద్దాలు ఇస్తారని అన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో ఈ కార్యక్రమం ఉండదని ఇది గమనించాలని సూచించారు. ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీసీలు రవీంద్రకుమార్, రవికుమార్, ఎంఆర్ఓ గోవర్ధన్, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాల ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వివేకానందనగర్ డివిజన్ బీజేపీ నాయకులు గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ గాలిపటాలను బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంక్రాంతి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ సంతోషంగా గడుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నరేంద్రరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి మణిభూషణ్, డివిజన్ అధ్యక్షుడు నర్సింగరావు, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఓబీసీ మోర్చా లీగల్ సెల్ శ్రీనివాస్ గౌడ్ డివిజన్ నాయకులు వేణు, రమేష్, జిల్లా నాయకులు బాలు యాదవ్, కూకట్‌పల్లి ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, బాలాజీనగర్ మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడపండి

మూసాపేట: మోతీనగర్, కబీర్‌నగర్ బస్సు స్టాప్, కేపీహెచ్‌బీ 4వ ఫేజు నుంచి సికింద్రాబాద్ వయా ఖైత్లాపూర్, మూసాపేట గుండా వెళ్లే 10హెచ్.ఎల్ బస్సు గతంలో ఉండేవని దానిని నిలిపివేశారని, కారణాలు ఏమైనప్పటికి తిరిగి బస్సు ఈ రూట్ గుండా ప్రయాణించే విధంగా చూడాలని డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఏఎస్ రాజును, కూకట్‌పల్లి డిపో మేనేజర్ మహ్మద్ ఇసాక్‌లకు మూసాపేట డివిజన్ కార్పొరేటర్ మహేందర్ బుధవారం వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మోతీనగర్ ప్రాంతంలోఅనేక మంది పెద్ద వారు ఉన్నారనివారు ప్రయాణించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి కూర్చోవడానికి వీలుగా ఉంటుందని, అదే విధంగా అనేక మంది కార్మికులు, వేరే జిల్లాలకు వెళ్లే వారికి రైలు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పాత పద్ధతిలో 10హెచ్ఎల్ బస్సు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రస్వామి, పోలాకి కిషోర్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణ ప్రాంత పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ రమ్యా గ్రౌండ్‌లో 3600 చదరపు గజాల విస్తీర్ణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం తన సొంత నిధులతో నిర్మించేందుకు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అతి త్వరలో ఎమ్మెల్యే కృష్ణారావు ఈ కార్యక్రమానికి శంకుస్థాపన నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఈ ప్రాంతాన్ని కార్పొరేటర్ పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా చేసి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఏఈ సాయి ప్రసాద్, సర్కిల్ ఇన్‌చార్జ్ హరికృష్ణ, ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, కిరణ్మయి, మెహబూబ్, రాము, రాంబాబు నాయుడు, జీఎల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో జిల్లా పరిషత్ స్కూల్

- నిర్మాణానికి రంగం సిద్ధం
- శనివారం శంకుస్థాపన చేయనున్న కలెక్టర్
- ఎన్టీఆర్ పేరిట నిర్మాణానికి ముందుకొచ్చిన కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు



కేపీహెచ్‌బీకాలనీ రమ్యా గ్రౌండ్స్ వద్ద నిర్మించనున్న హైస్కూల్‌కు సంబంధించిన ప్లాన్, ఊహా చిత్రాలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో తెలంగాణ ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్మాణానికి రంగం సిద్ధం అయ్యింది. లక్ష మందికి పైగా జనాభా కలిగిన హౌసింగ్ బోర్డు కాలనీలో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో పనులు మొదలు కానున్నాయి. యాభై ఏళ్ల కిందటే హౌసింగ్ బోర్డు లే ఔట్‌లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీలోని పాఠశాల స్థలంలో నూతనంగా హైస్కూల్ భవనం నిర్మించేందుకు నియోజకవర్గ నిధుల్లో నుంచి కోటి రూపాయలు మంజూరు చేశారు.

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న క్రమంలో హౌసింగ్ బోర్డు ఉన్నత పాఠశాలను ఎన్టీఆర్ పేరుతో నిర్మిస్తే కోటి రూపాయలు విరాళంగా ఇచ్చేందుకు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ముందుకొచ్చారు. దీంతో సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక హంగులతో హౌసింగ్ బోర్డులో ఉన్నత పాఠశాల నిర్మాణానికి రంగం సిద్ధం అయ్యింది. శనివారం ఉదయం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీష్‌చేతుల మీదుగా పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అందుబాటులోకి వస్తే హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉండే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కూకట్‌పల్లి గ్రామం వరకు వెళ్లాల్సిన అవసరం తీరడంతో పాటు వందలాది పేద కుటుంబాలకు ప్రభుత్వ విద్య చేరువకానుంది.

పాఠశాల ప్రత్యేకతలు..

- కూకట్‌పల్లి నియోజకవర్గంలోనే అత్యంత ఆధునిక హంగులతో అందుబాటులోకి రానున్న ఈ పాఠశాల సుమారు 3 వేల 6 వందల గజాల స్థలంలో నిర్మించనున్నారు.
- సుమారు 3 వేల 6 వందల గజాలతో 10800 చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాలను నిర్మిస్తున్నారు.
- చుట్టూ పాఠశాల తరగతి గదులు నడుమ ఖాళీ స్థలంలో అసెంబ్లీ వేదికను ఏర్పాటు చేయనున్నారు.
- ఉపాధ్యాయులకు ప్రత్యేక కార్యాలయం, ప్రిన్సిపాల్ ఛాంబర్ వంటివి ఆధునిక హంగులతో నిర్మించనున్నారు.
- మల్టీపర్పస్ హాల్, ఆక్టివిటీ గదులను నిర్మించనున్నారు.
- మొదటి విడతగా ఎమ్మెల్యే నిధుల నుంచి కోటి రూపాయలు, కార్పొరేటర్ శ్రీనివాసరావు విరాళంగా ఇవ్వనున్న మరో కోటితో కలిపి రెండు కోట్ల రూపాయల నిధులతో పనులు మొదలు పెట్టనున్నారు.
- ప్రధాన ద్వారం ఎదురుగా పచ్చటి గార్డెన్, మొక్కలు పెంచడంతో పాటు క్రీడా ప్రాంగణం కూడా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశారు.
- పక్కనే ఉన్న రమ్యాక్రీడా మైదానం, బాడ్మింటన్ కోర్టు ప్రాంగణాలు కూడా పాఠశాల పరిధిలోకి చేరి విద్యార్థుల్లో క్రీడల పట్ల మరింత ఆసక్తిని పెంపొందిస్తాయి.

మరిన్ని బడులను ఆధునీకరిస్తాం



నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టాం. నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పదికోట్ల నిధుల్లో అధిక శాతం ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించాం. పేద పిల్లలకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో కేపీహెచ్‌బీలోనూ హైస్కూల్ నిర్మాణానికి పూనుకున్నాం. రాబోయే విద్యా సంవత్సరానికి మరిన్ని పాఠశాలలు ఆధునీకరిస్తాం.

– మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే

ఎన్టీఆర్ పేరిట నిర్మాణం



స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతి పురస్కరించుకొని ఆయన పేరిట కేపీహెచ్‌బీలో ప్రభుత్వ పాఠశాలను నిర్మించేందుకు కోటి రూపాయలు విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చాను. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందిస్తున్న సేవల స్ఫూర్తితో నా వంతుగా స్వర్గీయ ఎన్టీఆర్ పేరిట పాఠశాల నిర్మిస్తున్నాం.

– మందడి శ్రీనివాసరావు, కేపీహెచ్‌బీకాలనీ కార్పొరేటర్

ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి 12 లక్షల 8 వేల 500 రూపాయలు మంజూరయ్యాయి. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో బుధవారం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటోందని పేర్కొన్నారు. అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, రాజుయాదవ్, శ్రీనివాస్ యాదవ్, సాంబశివరావు, జంగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లకు వాల్వ్ ఏర్పాటు

ఆల్విన్‌కాలనీ: కలుషిత తాగునీటి సరఫరాతో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని కూకట్‌పల్లి సర్కిల్‌పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీ, ప్రగతినగర్, రిక్షాపుల్లర్స్ కాలనీలో తాగునీరు వృథాగా పోవడంతో పాటు కాలుష్య జలాలు సరఫరా అవుతున్నాయని సాక్షిలో కథనం ప్రచురితమయ్యింది. «నిత్యం వృథాగా విలువైన తాగునీరు» అనే కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. బుధవారం ఆస్‌బెస్టాస్ కాలనీ, ప్రగతినగర్, రిక్షాపుల్లర్స్ కాలనీల్లో తాగునీటి పైపులైన్ వాల్వులను మార్చి నూతన వాల్వులను ఏర్పాటు చేశారు. మంచినీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.





ప్రగతినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీల్లో అధికారులు మార్చిన నూతన వాల్వ్‌లు

కబ్జాకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ఖాజాకుంట చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మట్టి పోసి ఫెన్సింగ్ తొలగించి కబ్జాకు పాల్పడుతుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆ ప్రాంతాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో కబ్జాకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, ఎవరైనా సరే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అక్కడే ఉన్న ఉప కమీషనర్ రవీందర్, తహసీల్దార్ గోవర్ధన్‌లకు కబ్జాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో చెరువులు సుందరీకరించి ఎస్టీపీ ప్లాంట్లు నిర్మిస్తుంటే ఈ విధంగా కబ్జాదారులు వారి ఇష్టానికి మట్టి పోస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. వెంటనే పూడ్చిన మట్టిని తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ 8 ఎకరాలు 17 కుంటల చెరువును అభివృద్ధి పర్చేందుకు జీహెచ్‌యంసికి స్వాధీన పరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, ఇంజనీరింగ్ అధికారి గోవర్ధన్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



కబ్జా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్, అధికారులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసీనగర్‌లో సీడీపీ ఫండ్స్, కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. తులసీనగర్‌కాలనీ వాసులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇతర బస్తీ, కాలనీవాసులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అవసరమైతే అదనపు కెమెరాలు ఏర్పాటు చేసుకోవటానికి తన వంతు ఆర్థిక సహాయం అందజేస్తానని ఆయన అన్నారు. ఈ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాధవరం రోజాదేవి, సీఐ సైదులు, ఎస్ఐ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు సమ్మారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



తులసీనగర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి సేవలు అమోఘం

చలన చిత్ర నటుడు సమ్మెట గాంధీ

మోతీనగర్: సమాజం పట్ల ఎంతో బాధ్యతగల వ్యక్తిగా ట్రాన్స్‌కో అధికారి సామాజిక కార్యకర్త కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న సేవలు అమోఘమని ప్రముఖ చలన చిత్ర నటుడు సమ్మెట గాంధీ పేర్కొన్నారు. బుధవార ం బాలాజీ స్వర్ణపురి కాలనీలోని సమ్మెట గాంధీ నివాసంలో మైత్రి వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళ్లెం శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలను గుర్తించి ఆయనను శాలువాతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైత్రి వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు మిట్ట విజయానంద్ మాట్లాడుతూ... కరోనాతో మృతి చెందిన వారి దహన సంస్కారాలు చేయటం, కరోనా బారిన పడిన వారికి వారికి మందులు అందజేయటం, నిరుపేదలకు విపత్తు సమయంలో ఉపాధి లేక అవస్థలు పడుతున్న వారికి అత్యవసర వస్తువులు అందజేయటం వంటి ఎన్నో సామాజిక సేవలు చేశారని కొనియాడారు. అటువంటి వ్యక్తి మైత్రి వాకర్ అసోసియేషన్‌లో సభ్యుడుగా ఉండటం ఎంతో గర్వించగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కార్టునిస్ట్, లేపాక్షి రెడ్డి, సభ్యులు రామాయణ్ రమేష్, కృష్ణారెడ్డి, లయన్ అన్నెం కోటిరెడ్డి, మల్లికార్జున్, రంగారెడ్డి, మల్లేష్, అరుణాచల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సామాజిక కార్యకర్త కళ్లెం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖ చలనచిత్ర నటుడు సమ్మెట గాంధీ

హైదర్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని నాగార్జున హోమ్స్‌లో 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో బుధవారం స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి డివిజన్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. సీసీ రోడ్ల పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేదేవ్, నాగార్జున హోమ్స్ నివాసితులు వెంకటరత్న కుమార్, కడియాల శివ, శ్యామ్, పీఎస్‌కే వర్మ, బాలకృష్ణ, డీఎస్ రాజు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



నాగార్జున హోమ్స్ వద్ద సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కేపీహెచ్‌బీ 4వ ఫేజు 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. గురువారం బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేపీహెచ్‌బీ 4వ ఫేజు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహీంద్రా అపార్టుమెంట్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జీతం సరిపోక చోరీల బాట

- గొలుసు దొంగను అరెస్టు చేసిన పోలీసులు
- బంగారు గొలుసు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్, సీఐ నర్సింగ్‌రావు

భాగ్యనగర్‌కాలనీ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సరోజ్ కుమార్ పాత్ర (29) ఫతేనగర్ శోభనా కాలనీలో నివాసముంటున్నాడు. ఓ కంపెనీలో మిల్లింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.



స్వాధీనం చేసుకున్న గొలుసు

- విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన సరోజ్ కుమార్ పాత్రకు వచ్చిన జీతం సరిపోకపోవటంతో పాటు ఆర్థిక ఇబ్బందులు చోటు చేసుకోవటంతో ఎలాగైనా సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో మహిళల మెడలో నుంచి గొలుసులు దొంగిలించాలని పథకం వేసుకున్నాడు.
- అయితే ఈ నెల 4వ తేదీన అశోక్ గోల్డెన్ కార్యాలయంలో హౌసేకీపింగ్ పని చేస్తున్న రామపుత్రుని జయలక్ష్మి తన విధులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళుతున్న క్రమంలో దొంగ ఆమె మెడలో ఉన్న 2.5 గ్రాముల బంగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయాడు. తన గొలుసును దొంగిలించినట్లు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.
- సీసీ ఫుటేజీ పరిశీలించగా నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో గొలుసు లాక్కెల్లినట్లు నిర్ధారించుకొని నిందితుడి కోసం మూడు బృందాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఉషాముళ్లపూడి కమాన్ వద్ద దొంగిలించిన బంగారు గొలుసును విక్రయించేందుకు యత్నిస్తుండగా సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు సరోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా బంగారు గొలుసు దొంగిలించినట్లు నేరాన్ని అంగీకరించాడు.
- దీంతో అతని వద్ద నుంచి 2.5 గ్రాముల గొలుసును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, డీఐ అంజనేయులు, ఎస్ఐ రజాక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడు సరోజ్‌కుమార్ పాత్ర

ఊరెళ్తున్నారా.. ఇళ్లు జర భద్రం

కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్



భాగ్యనగర్‌కాలనీ: సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు సొంత ఊర్లకు వెళ్లే వారు తమ ఇళ్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ, బాచుపల్లి, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘా పెంచుతున్నామన్నారు. కాలనీల్లో యూత్ కూడా ముందుకు వచ్చి గస్తీ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇళ్లల్లో ఉన్న బంగారు వస్తువులు, నగదు, నగలు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్‌ల్లో కానీ లేదంటే తమ వెంటనైనా తీసుకెళ్లాలని సూచించారు. ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు తాళాలు బయటకు కనిపించకుండా కర్టెన్ ఉండేలా చూసుకోవాలన్నారు. లేనిపక్షంలో సెంటర్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. ఊరుకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందజేస్తే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్లల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి. వాచ్‌మెన్, సెక్యూరిటీ వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ఈ పండుగ సమయాల్లో ఎన్ని దొంగతనాలు జరిగాయో డేటా తీసుకొని అటువంటి ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా ఏర్పాటు చేసి నిఘా ఎక్కువగా ఏర్పాటు చేయనున్నామన్నారు. రాత్రి సమయంలో లాడ్జిలు, ఓయో రూమ్‌లు, మెట్రో స్టేషన్‌లు, బస్‌స్టాండ్‌లు పరిశీలించటం జరుగుతుందన్నారు. తనిఖీ చేయటంతో పాత నేరస్తులు పట్టుబడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సెలవు రోజుల్లో గస్తీని పెంచటమే కాకుండా జైలు నుంచి విడుదలైన వారి డేటా తీసుకొని వారిపై కూడా నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని కొన్ని అపార్టుమెంట్‌లు, వాట్సప్ గ్రూపుల్లో తమవారిని కూడా యాడ్ చేయించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఘనంగా న్యూ ఏరా పాఠశాల వార్షికోత్సవం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్‌లో శివకుమారి స్థాపించిన న్యూ ఎరా పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో మంత్రముగ్ధులను చేశారు. ఒకదానికి మించి మరొకటి ప్రేక్షకులను ఆద్యంతం కదలకుండా కట్టిపడేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆనందోత్సాహానికి గురిచేసింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు వేసిన రామాయణం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థుల్లో దేశభక్తిని, తల్లి ప్రేమను పెంచే విధంగా చేసిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వేణు గోపాల్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు అపర్ణ, మృదుల, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళా కమిటీ ఆధ్వర్యం ముగ్గుల పోటీలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ రైతు బజార్ వద్ద ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ మహిళా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాధవరం రోజాదేవిలు ముఖ్య అతిథులుగా హాజరై ముగ్గులను పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్రాంతి సంబరాల్లో మహిళలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను సంక్రాంతి పండుగ విశిష్టతను నేటి తరం వారికి తెలియజేయడం ఈముగ్గుల పోటీల ప్రత్యేకత అన్నారు. దీనిని నిర్వహించిన మహిళా కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటంతో కూడిన ముగ్గును, బీఆర్ఎస్ పార్టీ, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను వివరిస్తూ వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస యాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు జిల్లా గణేష్, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస యాదవ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ, గౌరవ అధ్యక్షురాలు మధులత, మంజుల, శిరీష సత్తార్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ